గురు వారం
09-11-2023
సంపుటి - 08,
సంచిక - 383
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు వార్త పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## ముమ్మాటికి తెలంగాణ టీమ్ బీఆర్ఎస్

ప్రజల హక్కుల కోసం పోరాడే ఏకైక టీమ్ బీఆర్ఎస్

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్

9 ఏళ్లలో జరిగిన అభివృద్ధి ట్రైలర్ మాత్రమే

పారిశ్రామికవేత్తల సమస్యలన్ని తీరుస్తాం

విద్యుత్ తగినంత ఉండటం వల్లే పారిశ్రామిక వృద్ధి

పారిశ్రామిక వేత్తలతో సమావేశంలో మంత్రి కేటీఆర్



**హైదరాబాద్, నవంబర్ 8 (సమ సమాజం):** బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల టీమ్ అని.. కాంగ్రెస్, బీజేపీకి కాదని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ట్వీట్ చేసిన ఆయన.. రాహుల్ గాంధీ వచ్చి బీఆర్ఎస్ బీజేపీకి బీ టీమ్ అంటారని.. ప్రధాని మోదీ వచ్చి కాంగ్రెస్‌కు సీ టీమ్ అంటారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్, బీజేపీకు బీ టీమ్ కాదని, కాంగ్రెస్‌కు సీ టీమ్ కాదని ముమ్మాటికి తెలంగాణ టీమ్ అని పేర్కొన్నారు. 'తెలంగాణలో 'బీసీని ముఖ్యమంత్రి చేస్తాం".. రాష్ట్ర ఓటర్లకు కేంద్ర హోం మంత్రి అమిత్? షా ఇచ్చిన మాట ఇది. కేంద్రంలోని బీజేపీలో ప్రధాని నరేంద్రమోదీ తర్వాత అంతటి ప్రాధాన్యమున్న నేతగా

4వ పేజీలో...

## బరా బర్ ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతాం టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

ధరణి ముసుగులో కేసీఆర్ కుటుంబం హైదరాబాద్ పరిసర భూములను కబ్జా

కాళేశ్వరం పేరిట లక్ష కోట్లు మింగిన కేసీఆర్



**ఆదిలాబాద్, నవంబర్ 8 (సమ సమాజం):** ఎన్నికల ప్రచారంలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి దూసుకుపోతున్నారు. ప్రచారంలో భాగంగా ఈరోజు (బుధవారం) ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రజా గర్జన సభలో టీపీసీసీ చీఫ్ పాల్గొని ప్రసంగించారు. బరా బర్ ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని అన్నారు. ధరణిని రద్దు చేస్తే రైతుబంధు రద్దు అవుతుందని కేసీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ధరణి ముసుగులో కేసీఆర్ కుటుంబం హైదరాబాద్ పరిసర భూములను కబ్జా చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ టికెట్లు అమ్ముకుంటున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కోట్ల రూపాయలు ఉన్నోళ్లకే బీఆర్ఎస్ - బీజేపీ టికెట్లు ఇస్తే, ఓట్లున్న

4వ పేజీలో...

## 11 న రాష్ట్రానికి మరోసారి ప్రధాని మోడీ

పరేడ్‌గ్రౌండ్‌లో సభకు హాజరయ్యే అవకాశం



**హైదరాబాద్, నవంబర్ 8 (సమ సమాజం):** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్ని పార్టీలు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. బీజేపీ కూడా తమ అగ్రనేతలను ఆహ్వానిస్తూ ప్రచార హోరును పెంచింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభకు హాజరైన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. ఈ నెల 11న రాష్ట్రానికి మరోసారి ప్రధాని నరేంద్ర మోడీ రానున్నారు. పరేడ్ గ్రౌండ్ లో జరిగే బహిరంగ సభలో ప్రధాన మంత్రి పాల్గొననున్నారు. సాయంత్రం 4 గంటల 45 నిమిషాలకు బేగంపేట విమానాశ్రయానికి మోడీ రానున్నారు. 5

4వ పేజీలో...

# టిక్కెట్లు అమ్ముకునేటోడు.. రాష్ట్రాన్ని అమ్మడా?

## గాంధీభవన్‌కు తాళాలేసి చేసే ఆందోళనలు కనిపిస్తలేవా



- ధరణి వద్దన్నోళ్లను బంగాళాకాథంలో విసరేయాలి
- అమ్మపేరు...బొమ్మ పేరు చెప్పి దళితులకు మోసం
- సింగరేణిని ముంచింది..తెలంగాణను ఆగం చేసింది
- చెన్నూరులో చెల్లని వారు బెల్లంపల్లిలో చెల్లుతారా
- బెల్లంపల్లి ప్రజాశీర్వద సభలో కాంగ్రెస్‌పై సిఎం కెసిఆర్ ఫైర్
- కోనప్పలాంటి వారిని గెలిపించాలి
- అభివృద్ధి కోసం పరితపించే వ్యక్తి
- కాగజ్‌నగర్ సభలో సిఎం కెసిఆర్ పిలుపు
- తెలంగాణ ఏర్పాటులో ఆసిఫాబాద్ జిల్లా
- పోరాటయోధుడు కుమ్రం భీమ్ పేరు పెట్టాం
- గిరిజనులకు ఎంతో మేలు జరిగే చర్యలు
- కలెక్టరేట్, ఆసుపత్రులతో ఎంతో పురగోతి
- కాంగ్రెస్‌ను నమ్ముకుంటే అధోగతి తప్పదు
- ఆసిఫాబాద్ సభలో సిఎం కెసిఆర్
- కాంగ్రెస్‌ను నమ్మితే మళ్లీ పటేల్,పట్వారీ వ్యవస్థ
- ధరణి వద్దంటే దళారీ రాజ్యం తప్పదు
- రైతుల ఆత్మహత్యలు, ఆకటి చావులు తప్పవు
- కాగజ్‌నగర్ సభలో సిఎం కెసిఆర్ హెచ్చరిక

**బెల్లంపల్లి, నవంబర్ 8 (సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీ ఎంత గొప్పదంటే.. పీసీసీ అధ్యక్షుడు టికెట్లు అమ్మకుంటున్నడని ఆ పార్టీ నేతలే లొల్లిపెడుతున్నరని... గాంధీభవన్ దగ్గర గేట్లకు తాళాలు వేసి ఆందోళన చేస్తున్నరని సిఎం కెసిఆర్ అన్నారు.. ఇయ్యాల టికెట్లు అమ్ముకునేటోనికి రాష్ట్రాన్ని అప్పజెప్తె రేపు రాష్ట్రాన్ని అమ్మడా..? పార్టీ టికెట్లు అమ్మేటోళ్లు ఎంత గొప్పోళ్లు అన్నట్టు..? ఇసుంటి గొప్పోళ్లు మనకు కావాల్నా.. ప్రజల కోసం పనిచేసే బీఆర్ఎస్ పార్టీ కావాల్నా..? దయచేసి ఆలోచించాలన్నారు.. మీ దీవెన ఉంటే తెలంగాణను ఈ దేశంలో నంబర్ వన్ స్టేట్‌గా తీర్చిదిద్దుతామని సీఎం అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తోంది. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భం గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై కేసీఆర్ సెటైర్లు వేశారు. చెన్నూరులో చెల్లని రూపాయి.. బెల్లంపల్లిలో చెల్లుతదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై సీఎం కేసీఆర్ విమర్శల వర్షం గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ ఏనాడు ప్రజల సంక్షేమాన్ని, రైతుల క్షేమాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బుధవారం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బెల్లంపల్లిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపైన, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపైన, కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ బాస్ రాహుల్‌గాంధీపైన సీఎం కేసీఆర్ తనదైన శైలిలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ధరణిని బంగాళాఖాతంలో ఎయ్యాలె అంటున్నరు.

4వ పేజీలో...

# సహాయకుడిగా వచ్చే వారికీ ఇంక్ తప్పనిసరి..!

## తెలంగాణ ఎన్నికల్లో ఈసీ కీలక నిర్ణయం

ఎన్నికల్లో కీలక మార్పులు చేసిన ఈసీ



**హైదరాబాద్, నవంబర్ 8 (సమ సమాజం):** తెలంగాణలో ఎన్నికల ఏర్పాట్లను ఈసీ సమీక్షించింది. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పాటించాల్సిన రూల్స్ విషయంలో కొన్ని సూచనలు, నిబంధనలు జారీ చేసింది ఎన్నికల కమిషన్. తెలంగాణ ఎన్నికల్లో ఈసీ కీలక మార్పులు చేసింది. ఓటు వేయలేని వారికి సహాయకుడిగా వచ్చే వారి కుడి చేతి చూపుడు వేలుకు ఇకపై ఇంకు పెడతారు. సహాయకుడు అదే బూత్‌కు చెందిన ఓటరై ఉండాలి. తన ఓటు వేశాకే మరొకరికి సహాయకుడిగా వెళ్లాలి. ఓటు వేసేటప్పుడు ఎడమ చేయి చూపుడు వేలుకు ఇంకు పెడతారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ కీలక మార్పులు చేసింది. తెలంగాణ


4వ పేజీలో...

## అమిత్ షాకు త్రుటిలో తప్పిన ప్రమాదం



**న్యూఢిల్లీ, నవంబర్ 8(సమ సమాజం):** కేంద్ర హోం మంత్రి అమిత్ షా కొద్దిలో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. రాజస్థాన్ శాసన సభ ఎన్నికల్లో బీజేపీ తరపున ప్రచారం చేయడం కోసం ఆయ న నాగౌర్‌లో పర్యటించారు. ఆయన ప్రయాణిస్తున్న ప్రచార రథం పై భాగం ఓ విద్యుత్తు వైరుకు తగిలింది. వెంటనే నిప్పు రవ్వలు ఎగసిపడి, ఆ వైరు తెగిపోయింది. బిదియాద్ గ్రామం నుంచి పర్బుత్సర్‌కు వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది.

## పంజాబ్‌ను వణికించిన భూకంపం



**చండీగఢ్, నవంబర్ 8 (సమ సమాజం):**పంజాబ్‌లోని రూప్‌నగర్ బుధవారం వేకువ జామున భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 3.2 తీవ్రతతో 1.13 గంటల సమయంలో ప్రకంపనలు వచ్చాయని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ పేర్కొంది. రూప్‌నగర్‌లో భూమికి పది కిలోమీటర్ల లోతులో భూకం ప కేంద్రం గుర్తించినట్లు తెలిపింది. రాత్రి సమయంలో ఒక్కసారిగా ప్రకంపనలు రావడంతో జనం భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు పెట్టారు. అయితే, ఇప్పటి వరకు ప్రకంపనలతో ఎలాంటి నష్టం జరిగినట్లు నివేదికలు అందలేదని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. చైనా దక్షిణ జిన్‌జియాంగ్‌లోనూ ప్రకంపనలు వచ్చాయి. రిక్ట్ స్కేల్‌పై 5.5 తీవ్రతతో భూ కంపం వచ్చినట్లు యూరోపియన్ మెడిటరేనియన్ సిస్మోలాజికల్ సెంటర్ పేర్కొంది. భూమికి ఎనిమిది కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు వచ్చాయని పేర్కొంది.

## 50 కోట్లకు చేరిన ఫోన్‌పే వినియోగదారులు

PhonePe

**న్యూఢిల్లీ, నవంబర్ 8(సమ సమాజం):** ఏ): ఆర్థిక సేవల సంస్థ ఫోన్‌పే మరో రికార్డును సాధించింది. 50 కోట్ల మంది కస్టమర్లు ఫోన్‌పే సేవలను వినియోగించుకుంటున్నారు. అంతర్జాతీయంగా 50 కోట్ల మంది యూజర్లు కలిగిన తొలి భారతీయ సంస్థ ఫోన్‌పే కావడం విశేషం. ఈ సందర్భంగా ఫోన్‌పే ఫౌండర్, సీఈవో సమీర్ నిగమ్ మాట్లాడుతూ.. స్వల్పకాలంలోనే 50 కోట్ల మైలురాయికి చేరుకోవడం చాలా సంతోషంగా ఉన్నదని, సంస్థ లక్ష్యంగా పెట్టుకున్న 100 కోట్ల భారతీయుల్లో సగానికి చేరుకు న్నట్టు తెలిపారు. జనవరి 2022 నాటికి 35 కోట్ల యూజర్లకు చేరుకున్న సంస్థ..ఆ మరుసటి ఏడాదిన్న రలోగా మరో 15 కోట్ల కస్టమర్లను ఆకట్టుకోవడం విశేషమన్నారు. ప్రతి ముగ్గురి భారతీ యుల్లో ఒక్క రు ఫోన్‌పేను వినియోగిస్తున్నారు. కేవలం ఏడేండ్లలో ఈ మైలురాయికి చేరుకున్నది. అగస్టు, 2016 లో ఫోన్‌పే ఆర్థిక సేవలు ఆరంభించిన విశేషం తెలిసిందే.

## బీఆర్ఎస్, కాంగ్రెస్ డీఎన్ఏలో బీసీ వ్యతిరేకత



- బీసీ, దళితవర్గ వ్యక్తిని సీఎం చేసే దమ్ము బీఆర్ఎస్‌కు ఉందా
- పూర్తిగా బీజేపీకి అనుకూలంగా పరిస్థితులు
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

**హైదరాబాద్, నవంబర్ 8 (సమ సమాజం):** రాష్ట్రంలో బీసీ లేదా దళితవర్గ వ్యక్తిని సీఎం అభ్యర్థిగా ప్రకటించే దమ్ము బీఆర్ఎస్?కు ఉందా అని.. భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ డీఎన్?ఏలోనే బీసీ వ్యతిరేకత ఉందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీఆర్ఎస్?పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని.. పరిస్థితులు పూర్తిగా బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని అన్నారు. కరీంనగర్ పట్టణంలోని

4వ పేజీలో...

## బలి దానాలతో సాకారమైన తెలంగాణ

- ఆ తెలంగాణను బంగారం చేసుకోవాలి
- జనసేన అధినేత పవన్ కల్యాణ్
- అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేసిన పవన్



**హైదరాబాద్, నవంబర్ 8 (సమ సమాజం):** బలి దానాలతో సాకారమైన తెలంగాణను బంగారం చేసుకోవాలని పిలుపునిచ్చారు జనసేన అధినేత పవన్ కల్యాణ్.. తెలంగాణ అభివృద్ధి ఆశయ సాధన కోసం జనసేన పార్టీ కట్టుబడి ఉంటుందని, ఆంధ్ర ప్రదేశ్ పై దృష్టి సారిస్తూనే తెలంగాణ ప్రజలకు అండగా ఉండాలన్న లక్ష్యంతోనే తొలిసారి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగుతున్నామని తెలిపారు.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పోటీ చేస్తున్న ఎనిమిది స్థానాలకు సంబంధించిన అభ్యర్థులకు బీఫారమ్ అందించిన ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల కష్టనష్టాల్లో చేదోడువాదోడుగా ఉంటామన్నారు. తెలంగాణ

4వ పేజీలో...

## మార్ఫింగ్ చేస్తే మూడేళ్లు జైలు



**న్యూఢిల్లీ, నవంబర్ 8(సమ సమాజం):** : సినీ నటి రష్మిక మందన్నా డీప్‌ఫేక్ వీడియో వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. టెక్నాలజీ దుర్వినియోగంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో ఈ తరహా వీడియోలను

4వ పేజీలో...

# దుబ్బాకలో త్రిముఖ పోటీ

### రసవత్తరంగా మారిన పోరు ● ఎంపిపై దాడితో సానుభూతి కోసం బిఆర్ఎస్ తంటాలు

**సిద్దిపేట, నవంబర్ 8 (సమ సమాజం):** సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక అసెంబ్లీ సెగ్మెంట్‌లో మరోసారి హోరాహోరీ పోరు నడుస్తోంది. ఇక్కడ పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులు బలవంతులే కావడంతో పోటీ రసవత్తరంగా మారింది. మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, దుబ్బకా స్థానిక ఎమ్మెల్యే రఘునందన్ రావు, చెరుకు శ్రీనివాసరెడ్డిల మధ్య పోటీ రసవత్తరంగా మారింది. ఇటీవల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపి ప్రభాకర్ రెడ్డిపై పై హత్యాయత్నం జరగడంతో ఇక్కడి రాజకీయం వేడెక్కాయి. ఈ దాడిని తనపై జరిగిన దాడిగా కెసిఆర్ అభివర్ణించారు. దుబ్బాకను తిరిగి గెల్చుకోవడం కోసం మెదక్ ఎంపి ప్రభాకర్ రెడ్డిని బిఆర్ఎస్ రంగంలోకి దింపింది. మూడేళ్ల కింద జరిగిన ఉప ఎన్నికలో దుబ్బాక సీటు కోల్పోయిన బీఆర్ఎస్.. తిరిగి చేజిక్కించు కోవాలని పావులు కదుపుతోంది. నువ్వా.. నేనా అన్నట్లు జరిగిన ఆ ఎన్నికల్లో విజయం సాధించిన రఘునందన్ రావు రెండోసారి గెలుపు కోసం సర్వశక్తులొడ్డుతున్నారు. అందుకు తగిన వ్యూహాలు రచిస్తున్నారు. రెండుసార్లు మెదక్ ఎంపీగా గెలిచిన కొత్త ప్రభాకర్‌రెడ్డి మొదటిసారి బీఆర్ఎస్ నుంచి అసెంబ్లీ బరిలో దిగుతున్నారు. ఈసారి ఎలాగైనా అసెంబ్లీలో అడుగుపెట్టాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఆయన మాజీమంత్రి చెరకు ముత్యం రెడ్డి తనయుడు కావడంతో కాంగ్రెస్‌కు బాగా కలసి వచ్చే అంశం. ఈముగ్గురూ పోటాపోటీగా ప్రచారం చేస్తుండగా, కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తిదాడి జరిగింది. ప్రస్తుతం ఆయన హాస్పిటల్‌కే పరిమితమవగా, పార్టీ శ్రేణులు ప్రభాకర్‌రెడ్డి తరఫున ప్రచారం చేస్తున్నారు. ఉప ఎన్నికలో స్వల్ప ఓట్ల తేడాతో నెగ్గిన రఘునందన్ రావు ఈసారి మంచి మెజారిటీ సాధించాలని భావిస్తున్నారు. అందుకు తగిన కసరత్తు చేస్తున్నారు. ప్రచారంలో దూసుకెళ్తూ.. తాను గెలిచాక నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్నారు. వంద పడకల హాస్పిటల్ ప్రారంభం, బస్టాండ్ నిర్మాణం, డబుల్‌బెడ్‌రూమ్‌ఇండ్ల పంపిణీ, కొత్తగా వేసిన రోడ్లు, భూంపల్లి అక్బర్‌పేట మండలం ఏర్పాటు, సిద్దిపేట-మెదక్ నేషనల్‌హైవే ప్రారంభం గురించి పదేపదే ప్రస్తావిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే గ్రౌండ్ వర్క్ పూర్తి చేసిన రఘునందన్..బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ ఇన్‌చార్జ్‌లను యాక్టివ్‌చేశారు. ఇప్పటికే ప్రతి మండలం లోని10 గ్రామాల్లో ప్రచారం పూర్తి చేశారు. అన్ని వర్గాల మద్దతు కూడగడుతున్నారు. బీఆర్ఎస్ నుంచి పలువురు నేతల్ని బీజేపీలోకి రప్పించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు తనకే పడతాయని రఘునందన్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. కత్తి దాడి జరగక ముందు వరకు ప్రభాకర్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలే ప్రచార అస్త్రాలుగా ప్రజల్లోకి వెళ్లారు. పెన్షన్లు, రైతు బంధు, దళిత బంధు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ వచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బీఆర్ఎస్‌కు క్యాడర్ ఉండగా, కింది స్థాయి కార్యకర్తలను గుర్తించకపోవడం కొంత మైనస్ అని తెలుస్తోంది. కీలక సమయంలో ప్రభాకర్ రెడ్డి ఆస్పత్రి పాలవడం కొంత నష్టంగా భావిస్తున్నారు. ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థిపై దాడి ఘటన జరిగినా, ప్రజలు మాత్రం పెద్దగా పట్టించుకోవడం లేదు. సానుభూతి దక్కించుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నిస్తున్నాయి. మునుపటిలా పెద్దగా ప్రభావం చూపట్లేదని తెలుస్తోంది. దశాబ్ద కాలంగా దుబ్బాక నియోజకవర్గానికి ఎంపీగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి స్థానికంగా పట్టు సాధించలేకపోయారు. కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వ వ్యతిరేక ఓట్లతోపాటు, కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీములపై ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హస్తం పార్టీకి పెరిగిన ఆదరణ తనకూ కలిసొస్తుందని భావిస్తున్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా పనిచేసిన తండ్రి చెరుకు ముత్యంరెడ్డి నుంచి వారసత్వంగా వచ్చిన ఓటు బ్యాంక్ అదనపు బలం కానుంది. శ్రీనివాస్‌రెడ్డి మొదటిసారి దుబ్బాక ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి ఎలాగైనా గెలిచి అసెంబ్లీలోకి అడుగు పెట్టాలని పావులు కదుపుతున్నారు. మొత్తంగా ఇక్కడ త్రిముఖ పోటీలో ఎవరు నెగ్గుతారన్నది చూడాలి.



## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓటేయ్యండి : మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**వరంగల్, నవంబర్ 8 (సమ సమాజం):** బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గం అభ్యర్థి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. జిల్లాలోని రాయపర్తి మండలం రాగన్నగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమల్లోకి తెచ్చిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కండ్ల ముందు జరిగిన అభివృద్ధి చూసి ఆలోచన చేయాలన్నారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం సుభిక్షింగా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణకు అన్యాయం చేసిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. మంత్రి వెంట బీఆర్ఎస్ స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు కార్యకర్తలు ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు.

## అక్కడ అవార్డులిచ్చారు.. ఇక్కడ అసత్య ప్రచారాలు : మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, నవంబర్ 8 (సమ సమాజం):**కేసీఆర్ వచ్చాక మంచినీటి సమస్య తీర్చారని మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. నేడు ఆయన హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో మహిళా సమ్మేళనంలో మాట్లాడుతూ.. హైదరాబాద్ నీటి బిల్లులు కూడా లేవన్నారు. ఇంటింటికి మంచి నీళ్ళు అందించామన్నారు. మిషన్ భగీరథకు కేంద్రం అవార్డుల మీద అవార్డులు ఇచ్చిందన్నారు. కానీ ప్రధాని మోదీ వచ్చి పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. మోదీ ఢిల్లీలో అవార్డులు ఇస్తారని.. హైదరాబాద్‌కు వచ్చి అసత్య ప్రచారాలు చేస్తున్నారని హరీష్ రావు విమర్శించారు. మన మిషన్ భగీరథ పథకాన్ని కేంద్రంలో ఉన్న బీజేపీ కాపీ కొట్టిందన్నారు. కాంగ్రెస్ హయాంలో గల్లికో పేకాట క్లబ్బులు ఉండేవన్నారు. పేకాట క్లబ్బు నుంచి కోట్ల రూపాయలు కాంగ్రెస్ నేతల జేబుకు వెళ్లేవన్నారు. కాంగ్రెస్ మళ్ళీ అధికారం లోకి వస్తే పేకాట క్లబ్బులు వస్తాయన్నారు. కేసీఆర్ వచ్చాక పేకాట క్లబ్బులను ఉక్కు పాదంతో తొక్కేశారని హరీష్ రావు పేర్కొన్నారు

## కెసిఆర్ సభలకు బ్రహ్మాండమైన స్పందన

### బిజెపి విమర్శలు అర్థం లేనివి: పువ్వాడ



**ఖమ్మం, నవంబర్ 8 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ వెళ్లిన ప్రతి సభలో ప్రజల నుంచి స్పందన బ్రహ్మాండంగా వస్తోందని మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తమ నాయకుడు సీఎం కేసీఆర్ సభ నిర్వహిస్తే రెండు సభలు విజయవంతం అయ్యాయని తెలిపారు. గత 10 సంవత్సరాల్లో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లాయన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పోటీ చేస్తున్న తమ అభ్యర్థులందరిని బ్రహ్మండమైన మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇంతకు ముందు ఉన్న రాజకీయాల గురించి సీఎం కేసీఆర్ క్లియర్‌గా చెప్పారన్నారు. ఎన్నికలు వచ్చాయంటే అన్ని పార్టీల వారు వస్తుంటారని.. ఒకవేళ గెలిస్తే తిరిగి ఖమ్మం వైపు కూడా చూడరన్నారు. అస్సలు వారి చరిత్ర ఏంటి ప్రజలు గమనించి, వాళ్ళు 60 యేళ్లు అధికారంలో ఉండి ఖమ్మం జిల్లాకు ఏమి చేశారని ఆలోచించి ఓటు వేయాలన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులందరినీ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రధాని నరేంద్రమోదీపై మంత్రి విమర్శలు గుప్పించారు. పదేళ్ల తమ హయాంలో దేశంలోని బీసీలకు వేదన... అరణ్య రోదనే మిగిలిందని మండిపడ్డారు. 'రాహుల్ వచ్చి.. మమ్మల్ని మీ బీ టీమ్ అంటారు. మీరొచ్చి మేము కాంగ్రెస్ సీ టీమ్ అంటారు. మేం బీజేపీకి బీ టీమ్ కాదు. కాంగ్రెస్ కు సీ టీమ్ కాదు. మాది ముమ్మాటికీ ఈ టీమ్.. తెలంగాణ టీమ్. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఎవరితోనైనా.. ఎక్కడి దాకైనా పోరాడే ఏకైక టీమ్. నిన్నటి దాకా మత రాజకీయం చేశారు!!. నేడు కుల రాజకీయానికి తెర తీశారని అన్నారు. పదేళ్ల మీ హయాంలో దేశంలోని బీసీలకు మిగిలింది వేదన... అరణ్య రోదనే. కనీసం బీసీల జనగణన కూడా చేయని పాలన మీది. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను పెట్టని ప్రభుత్వం మీది అంటూ మంత్రి విమర్శలు గుప్పించారు. అందుకే బీజేపీ ముమ్మాటికీ బీసీల వ్యతిరేక పార్టీయే. బీసీలంటే మీ దృష్టిలో బలహీనవర్గాలు. కానీ.. మాకు బీసీలంటే.. బలమైన వర్గాలు. రాష్ట్రంలోని బీసీలకు పదవులే కాదు.. అనేక పథకాలిచ్చిన ప్రభుత్వం మాది. టీఎస్పీఎస్సీ పేపర్లు లీక్ చేసిందే మీ బీజేపీ నేతలు. నిందితులతో వేదిక పంచుకుని.. మాపై నిందలా అని మండిపడ్డారు. దర్యాప్తు సంస్థల దుర్వినియోగం లో కాంగ్రెస్ నే మించిపోయింది.. మీ బీజేపీ ప్రభుత్వం. ఒక్కసారి కూడా రుణమాఫీ చేయని మీరు.. రెండుసార్లు సంకల్పించిన మా సర్కారుపై విమర్శలు చేయడం నిజంగా విడ్డూరం. బీఆర్ఎస్ అంటేనే భారత రైతు సమితి అని పువ్వాడ అన్నారు.

## హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా

### మొదటి సెట్ నామినేషన్ వేసిన పొన్నం



**సిద్దిపేట, నవంబర్ 8 (సమ సమాజం):** హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మొదటి సెట్ నామినేషన్ పత్రాలను పొన్నం ప్రభాకర్ దాఖలు చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్వో కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి తో కలిసి వెళ్లి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హుస్నాబాద్ మెట్ట ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందన్నారు. సెంటిమెంట్‌కేమో హుస్నాబాద్ అంటున్నారని.. అభివృద్ధి అంతా గజ్వేల్, సిద్దిపేటలో చేస్తున్నారన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును కుర్చీ వేసుకొని పూర్తి చేస్తానన్న ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్లయిన పూర్తి చేయలేదని పొన్నం పేర్కొన్నారు. హుస్నాబాద్ ప్రాంతానికి వెన్నెముక లాంటి గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులు పూర్తి చేయలేదు.. కాబట్టే హుస్నాబాద్ ప్రాంత ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు.

## వికారాబాద్ అడవుల్లో చిరుత పులుల సంచారం

**హైదరాబాద్, నవంబర్ 8 (సమ సమాజం):** అటు అనంత పద్మనాభ స్వామి పుణ్యక్షేత్రం.. ఇటు ఆనందం, ఆహ్లాదం పంచుతూ రా రమ్మనే టూరిస్ట్ స్పాట్. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న అనంతగిరికి వెళ్లాలంటే ఓ కొత్త భయం పట్టుకుంది. వికారాబాద్ జిల్లా అనంతగిరి అడవుల్లో చిరుత పులుల సంచారంతో స్థానికులు, పర్యాటకులు భయాందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం పూడూరు మండలం దామగుండం అడవుల్లో, నేడు అనంతగిరి అడవిలో చిరుత సంచారం కలకల రేపింది. దామగుండం అడవుల్లో సీసీ కెమెరాకు చిరుత చిక్కింది. అనంతగిరిలో రోడ్డు దాటుతుండగా స్థానికులు చిరుతను చూసి ఆందోళనకు గురయ్యారు.

## బీఆర్ఎస్, బీజేపీలు రెండు ఒక్కటేనని : చాడ



**సిద్దిపేట, నవంబర్ 8 (సమ సమాజం):** హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ నేడు నామినేషన్ దాఖలు చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్వో కార్యాలయంలో ఆయన తన నామినేషన్ పత్రాలను అందజేశారు. సీపీఐతో కాంగ్రెస్ పార్టీ పొత్తు పెట్టుకున్న నేపథ్యంలో పొన్నం నామినేషన్ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు. పొన్నం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం చాడ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో సీపీఐ శ్రేణులు కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి కృషి చేస్తారన్నారు. అపర భగీరథుడు అని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ కట్టించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కృంగిపోయిందన్నారు. హుస్నాబాద్ మెట్ట ప్రాంత వరదాయని గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయలేదని.. హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ పట్టించుకోలేదని విఫలమయ్యాడని చాడ పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండు ఒక్కటేనని.. రాష్ట్రంలో ఆ రెండు పార్టీలను ఓడించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. పొన్నం ప్రభాకర్ గెలుపు కమ్యూనిస్టుల గెలుపుగా భావిస్తున్నామని చాడ వెంకటరెడ్డి తెలిపారు.

## మంత్రి గంగుల కమలాకర్‌కు భారీ ఊరట



**హైదరాబాద్, నవంబర్ 8 (సమ సమాజం):**మంత్రి గంగుల కమలాకర్‌కు భారీ ఊరట లభించింది. ఆయన ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈసీ నిర్ధారించిన వ్యయానికి మించి గంగుల ఖర్చు చేశారని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై కోర్టు తాజాగా విచారణ జరిపింది. విచారణ సందర్భంగా ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. సరైన ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. 2018 ఎన్నికల్లో గంగుల పరిమితికి మించి ఎన్నికల ఖర్చు చేశారని పొన్నం ప్రభాకర్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఆ ఎన్నికల్లో పిరమితికి మించి ఖర్చు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## ఆర్థిక కుంభకోణాలపై పిటిషన్ దాఖలు

### ఎంపీ రఘురామకృష్ణంరాజు



**న్యూఢిల్లీ, నవంబర్ 8 (సమ సమాజం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక కుంభకోణాలపై పిటిషన్ దాఖలు చేశానని.. వేరే ధర్మాసనం ముందు త్వరలో విచారణకు రానుందని, వాలంటీర్లను అడ్డుపెట్టుకొని అన్ని కార్యక్రమాలు చేస్తున్నారని ఎంపీ రఘురామకృష్ణంరాజు విమర్శించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఏపీ సీఎం జగన్ అక్రమాస్తులపై త్వరగా విచారణ జరపాలని మాజీ ఎంపీ (ఇలీ హరిరామ జోగయ్య పిటిషన్ వేయడం మంచి పరిణామమని, ఈ మేరకు తెలంగాణ హైకోర్టు జగన్‌కు నోటీసులు ఇవ్వడం శు భపరిణామమన్నారు. అన్ని ఒక్కసారిగా ముంచుకు వస్తున్నాయి.. ఎం జరుగుతుందో చూడాలన్నారు. సీఐడీ సంజయ్, పొన్నవోలు సుధాకర్ రెడ్డి అంతట తిరిగి ప్రెస్ మీట్‌లు పెట్టవచ్చా? చంద్రబాబు మాత్రం కేసుపై మాట్లాడొద్దని అంటారా? అంటూ మండిపడ్డారు. ఢిల్లీలో ఒక హోటల్లో సీఐడీ అధికారి సంజయ్, సుధాకర్ రెడ్డి పెట్టిన ప్రెస్ మీట్‌కు ఎవరు డబ్బులు కట్టారు?.. బిల్లులు ఎలా చెల్లించారని రఘురామ ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి సీఎం అవ్వగానే ప్రజావేదిక కూల్చారని, ప్రజావేదిక నిర్మాణానికి కాబినెట్ ఆమోదం కూడా ఉందని, అధికారులకు బుద్ధి ఉండాలి కదా అని అన్నారు. ప్రజావేదికను కూల్చడానికి ఎవరు హక్కు ఇచ్చారని సీఆర్డీఏ అధికారులను ఆయన ప్రశ్నించారు. దీనిపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేస్తానన్నారు. రెండు రోజుల్లో చంద్రబాబు నాయుడుపై పెట్టిన 17ఏ కేసు కొట్టేస్తారని రఘురామ అభిప్రాయం వ్యక్తం చేశారు. టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పని తీరు అద్భుతమని, ప్రజల కొరకు నిరంతరం పని చేస్తారని రఘురామ కొనియాడారు. పాలకొల్లులో టిడ్కో ఇళ్లులు ప్రజలకు ఇచ్చినట్టే ఇచ్చి.. దానిపై ప్రభుత్వం లోన్ తీసుకుందని విమర్శించారు. ప్రభుత్వం ఇళ్లపై తీసుకున్న లోన్ బయట పెట్టారని.. ఇదొక పెద్ద స్కాం అని అన్నారు. రేపు జగన్మోహన్ రెడ్డి ఏపీలో ఉన్న అందరి ఆస్తులను బ్యాంకుల్లో పెట్టె అవకాశం ఉందన్నారు. టీటీడి నియమాలు ధర్మారెడ్డికి తెలియవని, తెలియకుండా సీఎం జగన్ ఆయనను నియామకం చేశారని రఘురామ విమర్శించారు.

## ఆనందం కోసమే తప్పుడు కేసులు నారా లోకేశ్



**అమరావతి, నవంబర్ 8 (సమ సమాజం):** సైకో కళ్లలో ఆనందం కోసమే తప్పుడు కేసులు పెడుతున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. తప్పుడు కేసులు బనాయించడంలో కొంతమంది పోలీసులు గిన్నిస్ బుక్‌లో స్థానం కోసం పోటీ పడుతున్నట్లుగా కన్పిస్తోందన్నారు. రొంపిచర్లకు చెందిన నరసరావుపేట నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డిని సామాజిక మాధ్యమాల్లో పోస్టుల కేసు విచారణకంటూ తీసుకెళ్లి అక్రమ మద్యం కేసులో ఇరికించారని నారా లోకేష్ పేర్కొన్నారు. గత నాలుగున్నరేళ్లుగా టీడీపీ కార్యకర్తలు, నాయకులపై రాష్ట్రవ్యాప్తంగా 60వేల తప్పుడు కేసులు బనాయించారు. సైకో సీఎం కళ్లలో ఆనందం కోసం న్యాయదేవత కళ్లకు గంతలుకట్టి టీడీపీ కేడర్‌ను ఇబ్బందుల పాల్జేస్తున్న కొంతమంది పోలీసులు త్వరలో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని నారా లోకేష్ పేర్కొన్నారు.

## కుటుంబ పాలన అంతం కావాలి

### మీ హృదయాల్లో నాకు సుస్థిర స్థానం ఇచ్చారు ● కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 8 (సమ సమాజం):** తనను 7 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి రాష్ట్రంలో మంచి పేరు తెచ్చి పెట్టారని కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి పేర్కొన్నారు. ఒకట్రెండు సార్లు నన్ను ఓడించినా మీ హృదయాల్లో సుస్థిర స్థానం ఇచ్చారన్నారు. నందికొండ మున్సిపాలిటీ నుంచి పలువురు కౌన్సిలర్లు జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సాగర్ ప్రజలు విద్యుత్ బిల్లులు మాఫీ చేసింది తానేనని జానారెడ్డి తెలిపారు. బుద్ధవనం గుంటూరు జిల్లాకు వెళ్లకుండా తానే సాగర్‌కు రప్పించానన్నారు. బీఆర్ఎస్ ఒక్క హామీ కూడా పూర్తి చేయలేదన్నారు. 10ఏళ్ల పాలనలో కాంగ్రెస్ పార్టీ 30లక్షల ఇళ్లు ఇస్తే.. ఇదే 10 ఏళ్లలో బీఆర్ఎస్ పార్టీ ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను తప్పక అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. రైతులకు రుణమాఫీ చేస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలన అంతం కావాలని జానారెడ్డి అన్నారు. నాగార్జున సాగర్ అభివృద్ధికి కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు.

## చెత్త కుప్పలో 30 లక్షల డాలర్లు



**బెంగళూరు, నవంబర్ 8 (సమ సమాజం):** రోడ్డు పక్కన చిత్తు కాగితాలు ఏరుకునే వ్యక్తికి ఒక బ్యాగు దొరికింది. అందులో 30 లక్షల అమెరికన్ డాలర్ల కట్టలున్నాయి. భారతీయ కరెన్సీలోకి మారిస్తే వాటి విలువ సుమారు రూ.25 కోట్లు ఉంటుంది. ఈ నెల 3వ తేదీన బెంగళూరు నాగవార రైల్వే స్టేషన్ వద్ద పట్టాల పక్కన ఎస్కే సాల్మన్ చెత్త సేకరిస్తుండగా ఓ బ్యాగు దొరికింది. దానిపై యు నైటెడ్ నేషన్స్ అనే ముద్ర ఉంది. పశ్చిమ బెంగాల్‌లోని నాడియాకు చెందిన ఎస్కే సాల్మన్ బెంగళూరులో చెత్త ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సంచిని అమృతహళ్లిలోని ఇంటికి తీసుకెళ్లి తెరిచి చూడగా 23 బండిళ్ల డాలర్లు కనిపించాయి. ఏం చేయాలో తెలియక గుజరీ వ్యాపారికి ఈ విషయం చెప్పాడు. తాను వేరే ఊరికి వెళ్లానని, బెంగళూరుకు వచ్చేవరకు మీ వద్ద పెట్టుకోవాలని సూచించాడు. కానీ భయపడ్డ సాల్మన్.. రెండురోజుల తర్వాత స్వరాజ్ ఇండియా సామాజిక కార్యక ర్త ఆర్.కలీముల్లాను కలిసి విషయం చెప్పాడు. కలీముల్లా ఈ సంగతిని నగర పోలీస్ కమిషనర్ ద యానందకు తెలిపారు. ఆయన సూచనతో సాల్మన్‌ను, నగదును తీసుకుని కమిషనర్ ఆఫీసుకు వెళ్లారు. మరోవైపు నగదు దొరికిన ప్రదేశంలో పోలీసులు తనిఖీలు చేశారు. ఈ డాలర్లు నకిలీవని భావిస్తున్నారు. తనిఖీ కోసం వాటిని నగరంలోని రిజర్వు బ్యాంకుకు పంపినట్టు పోలీసులు తెలిపారు. ఈ డబ్బు ఐక్యరాజ్యసమితి ఆర్థిక నేరాల విభాగానికి చెందినదని పోలీసులు చెప్పారు. బ్యాగులో విషపూరితమైన రసాయనాలున్నందున.. తెరిచేటప్పుడు జాగ్రత్త అని ఒక పెద్ద లెటర్ కూడా అందు లో ఉండటం విశేషం. అంత డబ్బును చూశాక తాను ఉద్వేగంతో ఒక రోజంతా నిద్రపోలేదని సాల్మ న్ చెప్పాడు.

# మహిళలపై సీఎం నితీశ్ వ్యాఖ్యలపై దుమారం

## వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటన

## అసెంబ్లీలోనే క్షమాపణలు చెప్పిన నితీశ్



**బీహార్, నవంబర్ 8 (సమ సమాజం):** బీహార్ అసెంబ్లీలో జనాభా నియంత్రణ గురించి మాట్లాడుతూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని సృష్టించాయి. ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. ముఖ్యంగా మహిళా ప్రజా ప్రతినిధులు అగ్గి మీద గుగ్గిలమయ్యారు. అసెంబ్లీలోకి అడుగుపెట్టకుండా అడ్డుకున్నారు. చివరకు ఆయన మరో ద్వారం నుంచి లోపలకు వెళ్లాల్సి వచ్చింది. తన వ్యాఖ్యలు సృష్టించిన కలకలం ఆయనకు అర్థమైంది. నిరసన సెగ నితీశ్‌కు చురక అంటించింది. అంతే.. తప్పును గ్రహించిన నితీశ్, క్షమాపణ కోరుతూ తనను తానే నిందించుకున్నారు. చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని ప్రకటించారు. తాను కేవలం మహిళా విద్య గురించి మాత్రమే మాట్లాడానని, తన ప్రకటనను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరణ ఇచ్చారు. ఇంత రచ్చకు కారణమైన ఆయన వ్యాఖ్యలు రాజకీయంగా దెబ్బకొడతాయా లేక క్షమాపణ కోరడం వల్ల నష్టాన్ని నివారిస్తుందా అన్నదే ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ జనాభా నియంత్రణ గురించి మాట్లాడుతున్నారు. 'ఒక మహిళ కోరుకుంటే, ఆమె జనాభాను నియంత్రించగలదు' అని చెప్పాలనుకున్నారు. కానీ ఆయన అంతటితో ఆగలేదు. 'మహిళ కోరుకుంటే తన భర్తను సెక్స్ చేయకుండా ఆపగలదు' అంటూ వివాదాన్ని రాజేశారు. నితీష్ కుమార్ చేసిన ఈ ప్రకటన తీవ్ర కలకలాన్ని సృష్టించింది. నితీశ్ కుమార్ సెక్స్ ఎడ్యుకేషన్ గురించి మాట్లాడారని, అందరికీ అర్థమయ్యే భాషలో వివరించారని కొందరు సమర్థించుకొచ్చే ప్రయత్నం చేశారు. కానీ నితీష్ కుమార్ చేసిన ఆ ప్రకటన మహిళా ఎమ్మెల్యేలను తీవ్రంగా బాధించింది. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను అందరూ తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ మెయిన్ ఎంట్రన్స్ గేట్ వద్ద సీఎంను ఘెరావ్ చేశారు. సీఎం లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. చేసేది లేక మరో ద్వారం నుంచి నితీశ్ అసెంబ్లీ లోపలకు వెళ్లారు. సభ లోపల కూడా నిరసన జ్వాలలు ఆగలేదు. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి మరీ గోల చేశారు. సీఎం వ్యాఖ్యలను తప్పుబడుతూ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో నితీశ్ కుమార్ తన వ్యాఖ్యలపై అసెంబ్లీలోనే వివరణ ఇస్తూ క్షమాపణలు చెప్పారు. తన వ్యాఖ్యలకు తానే సిగ్గుపడుతున్నానని అన్నారు. 'నన్ను నేను విమర్శించుకుంటున్నాను. నా వ్యాఖ్యల పట్ల సిగ్గుపడటమే కాకుండా విచారం కూడా వ్యక్తం చేస్తున్నాను. నేను మహిళలకు అండగా ఉంటాను. తాను కేవలం మహిళా విద్య గురించే మాట్లాడాను. మహిళలు చదువుకుంటే జనాభా పెరగదు అన్నదే తన మాటల అర్థం' అంటూ వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలతో ఏకీభవిస్తూ కొందరు సమర్థించినప్పటికీ.. తాను తన మాటలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించారు. బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను సమర్థిస్తూ ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడిన అంశాన్ని సరైన కోణంలో చూడాలని కోరారు. ఆయన మాటల్లో అభ్యంతరకరం ఏమీ లేదని, సెక్స్ ఎడ్యుకేషన్‌లో భాగంగా పాఠశాలల్లో పిల్లలకు ఈ విషయాలు చెబుతారని తెలిపారు. ఆయన మాటలను ఎవరైనా తప్పుగా అర్థం చేసుకుంటే అది సరికాదని అన్నారు. సెక్స్ ఎడ్యుకేషన్ గురించి మాట్లాడ్డానికి ప్రజలు సిగ్గుపడుతుంటారని, నితీశ్ కేవలం జనాభా నియంత్రణ గురించి మాట్లాడుతూ ఈ విషయం చెప్పారని అన్నారు. వాటిని వక్రీకరిస్తూ వివాదాస్పదం చేశారని తేజస్వి యాదవ్ అన్నారు. తేజస్వి యాదవ్‌తో ఆయన తల్లి, బిహార్ మాజీ సీఎం రబ్రీదేవి కూడా గొంతు కలిపారు. నితీశ్ నోటి నుంచి పొరపాటున మాట దొర్లిందని, దాన్ని నొక్కి చెప్పాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. నితీశ్ మహిళలను అవమానించారు: ప్రతిపక్షాలు నితీష్ ప్రకటనపై బీహార్ లెజిస్లేటివ్ కౌన్సిల్ మహిళా ఎమ్మెల్సీ నివేదా సింగ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నితీష్ వ్యాఖ్యల అనంతరం ఆమె సభ నుంచి బయటకెళ్లి కన్నీరు పెట్టుకున్నారు. నితీష్ కుమార్ మహిళలను అవమానించారని నివేదా సింగ్ అన్నారు. ఆయన మాట్లాడిన విషయాలు అందరికీ తెలిసినవే అని, కానీ వాటిని సభలో బహిరంగంగా ఇలా మాట్లాడకూడదని అన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ కూడా నితీశ్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. అసభ్యకరంగా ఆయన మాట్లాడారని నిందించారు. 'థర్డ్ గ్రేడ్' వ్యాఖ్యలుగా అభివర్ణిస్తూ నితీశ్ మతిస్థిమితం కోల్పోయారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బిహార్‌కు చెందిన మరో కేంద్ర మంత్రి అశ్విని కుమార్ చౌబే కూడా నితీశ్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. చట్టసభల సభ్యతను మంటగలిపారని, ఆయన ముందు రాజీనామా చేసి వెంటనే ఓ వైద్యుణ్ణి సంప్రదించాలని సూచించారు. మొత్తమ్మీద ఇంత వివాదాన్ని సృష్టించిన ఆయన వ్యాఖ్యలు మహిళా నేతలనే కాదు, మహిళా ఓటర్లను కూడా ప్రభావితం చేస్తాయనడంలో సందేహం లేదు. రాజకీయాల్లో 'మాట తెచ్చే చేటు' గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసి పదవులు కోల్పోయిన ఘటనలు, ఎన్నికల్లో ఓడిపోయిన ఉదంతాలు దేశంలో అనేకం ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో నితీశ్ కుమార్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటూ క్షమాపణ కోరినప్పటికీ.. అవి ప్రజల్లోకి దావాగ్నిలా వ్యాపించాయి. వాటిపై ఆయన ఇచ్చిన వివరణ కంటే ముందు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలే ఎక్కువ మందికి చేరతాయి. దీంతో క్షమాపణతో నష్ట నివారణ సాధ్యం కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఇది చాలా అవమానకరమైన చర్య

## రష్మిక తప్పుడు వీడియోపై కేటీఆర్ ఆగ్రహం



**హైదరాబాద్, నవంబర్ 8 (సమ సమాజం):** సినీ నటి రష్మిక మందన్నా డీప్‌ఫేక్ వీడియో వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. జారా పటేల్ అనే ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌కి సంబంధించిన వీడియోకి రష్మిక ముఖాన్ని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అదికాస్తా వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పలువురు ప్రముఖులు ఇప్పటికే స్పందించారు. టెక్నాలజీ దుర్వినియోగంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనపై తాజాగా తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఓ నేషనల్ ఛానెల్ నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్.. రష్మిక మార్ఫింగ్ వీడియో గురించి ప్రస్తావించారు. అదో అవమానకరమైన చర్యగా అభివర్ణించారు. నటి రష్మిక మందన్నా డీప్‌ఫేక్ వీడియో గురించి వార్తల్లో చూసినట్లు చెప్పారు. అదో చేదు అనుభవమని.. ఓ సెలబ్రిటీని ఈ విధంగా కించపరచడం నిజంగా దారుణమని అన్నారు. ఇలాంటి ఘటనల కట్టడికి చట్టపరంగా చర్యలు తీసుకువస్తే వాటిని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలపై భారత ప్రభుత్వం కూడా ఆలోచన చేస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. కొందరు ఆకతాయిలు ఫొటోను మార్ఫింగ్ చేసి ఓ అసభ్యకర వీడియోను సృష్టించారు. వీడియోలో రష్మిక బాగా ఎక్స్‌పోజింగ్ చేసినట్టు కనిపిస్తుంది. వీడియో చూసిన అభిమానులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. రష్మిక ఏంటి.. ఇలా తయారైంది అంటూ మాట్లాడుకున్నారు. దీనిపై అనుమానం వచ్చిన కొందరు నెటిజన్లు.. అసలు నిజాన్ని బయటపెట్టారు. ఇది ఒరిజినల్ వీడియో జారా పటేల్ అనే ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌కి సంబంధించినదిగా తేల్చారు. ఆమె వీడియోని ఎవరో రష్మిక ఫేస్ తో అనుమానం రాకుండా మార్ఫింగ్ చేసి రిలీజ్ చేసినట్లు గుర్తించారు. దీంతో ఒరిజినల్ వీడియో, రష్మిక డీప్‌ఫేక్ మార్ఫింగ్ వీడియోను షేర్ చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నెటిజన్లే కాదు, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కూడా సీరియస్ అయ్యారు. ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మోడీ లేకుండా మిజోరం ఎన్నికల ప్రచారం

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ సంక్షోభంలోకి వెళుతున్నట్టు ఆ పార్టీ పెద్దల చర్యలు తెలియజేస్తున్నాయి. తొమ్మిదేళ్ల క్రితం కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీ స్టార్ క్యాంపైనర్‌గా ప్రధాని వ్యవహరిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల లోనే కాదు, అసెంబ్లీ ఎన్నికలు, స్థానిక ఎన్నికలు, ఉప ఎన్నికల్లో కూడా మోడీనే ప్రధాన ప్రచారకర్త. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు రోజుల పాటు ప్రచారం చేసిన ప్రధాని 19 ర్యాలీలు, ఆరు రోడ్ షోలలో పాల్గొన్నారు. అలాంటిది మిజోరంలో ఈసారి ప్రచారానికి ప్రధాని దూరంగా ఉండడం అందరి దృష్టిని ఆకర్షిస్తోందిజ అక్టోబర్ 30న మిజోరంలో ప్రధాని ఎన్నికల ప్రచారం నిర్వహించాల్సి ఉంది. మిజో యేతర జనాభా అధికంగా ఉన్న మామిత్‌లో ప్రధాని బహిరంగ సభకు ఏర్పాట్లు జరిగాయి. అయితే ప్రధానితో వేదిక పంచుకోవడానికి తాను సిద్ధంగా లేనని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఎన్డీయే నేత జోరమ్ తంగ చెప్పడంతో మోడీ ప్రచారం నుంచి తప్పుకున్నారు. మణిపూర్‌లో డజన్ల కొద్దీ క్రైస్తవ చర్చిలను తగలబెట్టారు. అలాంటి బీజేపీ ప్రధానితో వేదికను ఎలా పంచుకుంటామని జోరమ్ తంగ ప్రశ్నించారు. మిజోరం క్రైస్తవుల మెజారిటీ ఉన్న రాష్ట్రం. మయన్మార్ శరణార్థుల బయోమెట్రిక్ డేటా సేకరించాలని కేంద్రం చేసిన అభ్యర్థనను మిజోరం ప్రభుత్వం పట్టించుకోలేదు. మిజో నేషనల్ ఫ్రంట్ కూడా ఏకరూప పౌర స్మృతి (యుసిసి)ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ప్రకటించింది. ఎన్డీయే పక్షమైనప్పటికీ మోడీ ప్రభుత్వాన్ని విశ్వాసంలోకి తీసుకోవడానికి ఎంఎన్ఎఫ్ సిద్ధంగా లేదు. ఈ స్థితిలో మోడీ మిజోరం పర్యటనకు దూరంగా ఉన్నారు. మిజోరంలో ప్రచారానికి దూరంగా ఉండేందుకు ప్రధానిని ప్రేరేపించిన మరొక అంశాన్ని కూడా ప్రస్తావించుకోవాలి. మిజోరం వెళితే మణిపూర్‌లో ఎందుకు పర్యటించ డంలేదన్న ప్రశ్న ఉత్పన్నయవుతుంది. మే 3వ తేదీన మణిపూర్‌లో మారణహోమం ప్రారంభమైంది. నవంబర్ 3కి ఆరు నెలలు పూర్తవుతుంది. మోడీ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మణిపూర్‌లో పర్యటించలేదు. బ్రిడ్జిలు, రోడ్లు, వందేభారత్ రైళ్లకు పచ్చ జెండా ఊపేందుకు తీరిక వుంది కానీ...డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఉన్న మణిపూర్‌లో పర్యటించడానికి ప్రధానికి తీరిక దొరకలేదని ప్రతిపక్షం ఇప్పటికే ఎద్దేవా చేసింది. ఒకవేళ మోడీ మిజోరం పర్యటించినట్లయితే... పక్కనే వున్న మణిపూర్ బాధితులను పరామర్శించాలన్న విపక్షాల డిమాండ్ ఊపందుకుంటుంది. ఈ కారణంగానే మోడీ మిజోరం ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఇది మోడీకి, బీజేపీ కి గట్టి దెబ్బ అంటున్నారు రాజకీయ పరిశీలకులు. మోడీ, అమిత్ షాలు ఇప్పుడు హిందీ భాషా రాష్ట్రాల్లో బీజేపీ వ్యతిరేకతను ఎలా అధిగమించాలనే అంశంపై స్టడీ చేస్తున్నారు. తన రెగ్యులర్ ఎజెండాకు తిరిగి వెళ్లేందుకు బిజెపి ప్రయత్నిస్తోంది. ఈ ఎన్నికల వ్యూహంలో భాగం గానే రామక్షేత్ర అంశం తిరిగి ముందుకొచ్చింది. జనవరి 22న అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభిస్తామని మోడీ ప్రకటించారు. అయితే ఈ అంశం మునుపటి లాగా ఓటర్లను ప్రభావితం చేయకపోవడం, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపలేక పోవడం బిజెపిని నిరుత్సాహపరుస్తోంది. అయి నప్పటికీ మధ్యప్రదేశ్, ఇతర చోట్ల బిజెపి ఎన్నికల ప్రచారంలో అయోధ్య ఆలయ అంశాన్ని విస్తృతంగా ఉపయోగించారు. అక్టోబర్ 28 నుండి 30 వరకు మధ్యప్రదేశ్‌లో ప్రచారం చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేవనెత్తిన ప్రధాన అంశం రామమందిరమే. గతంలో డిఎంకే మంత్రి సనాతన ధర్మానికి వ్యతిరేకంగా తెరపైకి రాగానే...దాన్ని ప్రధాన ఎన్నికల అంశంగా మార్చేందుకు మోడీ సహా ముఖ్య నేతలంతా సిద్ధమయ్యారు. కానీ అది కూడా తగినంత దృష్టిని ఆకర్షించలేదు. హిందీ భాష వంటి అంశాలను తెరపైకి తెచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాన్ని వ్వకపోవడం బిజెపి వర్గాలను నిరాశకు గురిచేసింది. ఇలాంటి అంశాల కంటే నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతి తదితరాలపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. దీంతోపాటు కుల గణన చేయాలనే విపక్షాల డిమాండ్ కూడా చర్చనీయాంశం అవుతోంది. అయితే అధికారం, డబ్బు బిజెపికి అనుకూల అంశాలు. అఖిల భారత స్థాయిలో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విశాల ప్రతిపక్ష వేదిక 'ఇండియా'ను ఏర్పాటు చేసినప్పటికీ, అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ చొరవతో ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధంగా లేకపోవడం శోచనీయం. ఉదాహరణకు మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసేందుకు సమాజ్‌వాది పార్టీ సిద్ధమైంది. ఉత్తరప్రదేశ్‌కు ఆనుకుని ఉన్న మధ్యప్రదేశ్ జిల్లాల్లో సమాజ్‌వాది పార్టీ ప్రభావం ఉంది. గతసారి ఎస్.పి కి ఒక్క సీటు వచ్చింది. నాలుగు నుంచి ఆరు సీట్లు ఇస్తే పొత్తు పెట్టుకోవచ్చని ఎస్.పి తెలియజేసింది. ఎస్.పి నేత అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ నేత దిగ్విజరు సింగ్ కూటమి ఏర్పాటు కానుందని సమాచారం. అయితే ఎస్.పి సిట్టింగ్ సీటుతో సహా ఏకపక్షంగా కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించడంతో పొత్తు కుప్పకూలింది. దాంతో అఖిలేష్ యాదవ్ మరింత ముందుకెళ్లిపోయి....లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు సీటు ఇచ్చేందుకు తాను సిద్ధంగా లేనన్నారు. దీన్ని బట్టి, కాంగ్రెస్ ఇతర పార్టీలను అంగీకరించలేకపోతోంది. వాటితో కలిసి ముందుకు సాగడం లేదన్న వాస్తవం అర్థమవుతోంది. రాజస్థాన్‌లోనూ ఇదే పరిస్థితి. ఇక తెలంగాణ సంగతి సరేసరి. కాంగ్రెస్ ఒక్కటే బిజెపి ని గద్దె దించలేదనే వాస్తవాన్ని అంగీకరించడానికి వారు ఇప్పటికీ సిద్ధంగా లేరు. లోక్‌సభ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ ఇదే విధానాన్ని అవలంబిస్తే విపక్షాలకు మరోసారి నిరాశ తప్పదు!

# జగన్‌ను కలిసిన ధన్యవాదాలు తెలిపిన జర్నలిస్టులు



**అమరావతి, నవంబర్8(సమ సమాజం):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు జర్నలిస్టు సంఘం నాయకులు, సీనియర్ జర్నలిస్టులు.. ఇటీవల జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయిస్తూ కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నందుకు క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ యూనియన్ నేతలు జి ఆంజనేయలు, ఎస్.వెంకటరావు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి వి ఆర్ కృష్ణంరాజు, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధి విజయ్ భాస్కర్, స్వర్ణాంధ్ర పత్రిక ఎడిటర్ కేబీజీ తిలక్, టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధి దారా గోపి, ది హిందూ ప్రతినిధి అప్పాజీ రెడ్డిమ్, దక్కన్ క్రానికల్ ప్రతినిధి ఎండీ ఇలియాస్, ఎన్‌టీవీ ప్రతినిధి రెహానా, టీవీ 9 ప్రతినిధి ఎస్ హసీనా, సాక్షి టీవీ మేనేజింగ్ ఎడిటర్ నేమాని భాస్కర్, సాక్షి దినపత్రిక రెసిడెంట్ ఎడిటర్ ఎం రమణమూర్తి సహా పలువురు సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు. కాగా, జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే.. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అక్రిడేటెడ్ జర్నలిస్టులకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలనే ప్రతిపాదనకు ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ఆమోద ముద్ర వేసింది.. దీంతో.. ఎంతో కాలంగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తోన్న జర్నలిస్టులకు శుభవార్త చెప్పింది వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సర్కార్. దీంతో.. సీఎం వైఎస్ జగన్‌తో ప్రత్యేకంగా సమావేశమైన ధన్యవాదాలు తెలిపారు జర్నలిస్టు సంఘం నేతలు, సీనియర్ జర్నలిస్టులు.

# అతి చిన్న నియోజకవర్గంగా చార్మినార్



**హైదరాబాద్, నవంబర్8(సమ సమాజం):** రాష్ట్రాన్ని భౌగోళికంగా పరిశీలిస్తే అతి చిన్న నియోజకవర్గం చార్మినార్. ఈ నియోజకవర్గం 5.31 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్నది. అతి పెద్ద నియోజకవర్గంగా ములుగు 3,979 చదరపు కిలోమీటర్లు ఉన్నట్లు అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. అత్యల్పంగా భద్రాచలంలో 1.46 లక్షలు, అత్యధికంగా శేరిలింగంపల్లిలో 6.94 లక్షల మంది ఓటర్లున్నారు. రవాణా, భౌగోళిక పరిస్థితులను బట్టి పాలనను అందరికీ చేరువ చేయాలని తెలంగాణ ప్రభుత్వం జిల్లాలను పునర్విభజన చేసింది. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత అనేక శాసన సభ నియోజకవర్గాలు రెండు, మూడు జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. 36 శాసన సభ నియోజకవర్గాలు రెండు జిల్లాల పరిధిలో ఉండగా, 8 శాసనసభ నియోజకవర్గాలు మూడు జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. 75 శాసనసభ నియోజకవర్గాలు ఒకే జిల్లా పరిధిలో ఉన్నాయి.

# కేసీఆర్ హెలికాప్టర్‌లో మరోసారి సాంకేతిక లోపం



**హైదరాబాద్, నవంబర్ 8 (సమ సమాజం):** తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ తన పార్టీ ప్రచారంలో వేగం పెంచారు. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆయన చాపర్ టేకాఫ్ అయ్యేందుకు మొరాయిస్తోంది. దీనిపై అప్రమత్తమైన ఫైలట్ హెలికాప్టర్‌ను నిలిపివేశారు. తెలంగాణలో ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఈ క్రమంలో ప్రతి రాజకీయ పార్టీ తమ పార్టీ ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ పార్టీ దూకుడుగా ముందుకు సాగుతోంది. గత నెలలో ఎన్నికల శంఖారావాన్ని పూరించిన సీఎం కేసీఆర్ సుడిగాలి పర్యటనలతో బిజీ అయ్యారు. ప్రతి రోజూ మూడు సభలు ఉండేలా ప్రణాళికలు రచించారు. ఇక సభలకు వెళ్లేందుకు ప్రత్యేకంగా హెలికాప్టర్ ఉపయోగిస్తున్నారు. సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో మరోసారి సాంకేతికలోపం తలెత్తింది. దీంతో చాపర్‌ను నిలిపివేశారు పైలట్. మామూలుగా అయితే సిర్పూర్‌లో కేసీఆర్ హెలికాప్టర్ టేకాఫ్ కావాల్సి ఉంది. సాంకేతిక సమస్య తలెత్తడంతో రోడ్డు మార్గం గుండా ఆసిఫాబాద్ బయలుదేరారు కేసీఆర్. ఇలా జరగడం కొత్తేమీ కాదు. గతంలో కూడా కేసీఆర్ చాపర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. సోమవారం నాడు సిద్దిపేట జిల్లాలోని ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి మహబూబ్ నగర్ పర్యటన కోసం హెలికాప్టర్‌లో బయలుదేరారు కేసీఆర్. అయితే హెలికాప్టర్ పైకి లేచిన కొద్ది సమయానికే సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో అప్రమత్తమైన పైలెట్ వెంటనే అక్కడే సేఫ్ ల్యాండింగ్ చేశారు.

# చంద్రబాబు ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

## ఈ నెల 22కి వాయిదా వేసిన హైకోర్టు




**అమరావతి, నవంబర్ 8 (సమ సమాజం):** టీడీపీ అధినేత చంద్రబాబుపై వరుసగా కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి.. ఏసీబీ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు.. ఇలా వివిధ కోర్టుల్లో చంద్రబాబు పిటిషన్లపై విచారణ సాగుతూనే ఉంది.. అయితే, తాజాగా చంద్రబాబుపై ఉచిత ఇసుక విధానంలో విషయంలోనూ కేసు నమోదు అయిన విషయం విదితమే.. ఇక, ఆ పాలసీ ద్వారా రాష్ట్ర ఖజానాకు చంద్రబాబు నష్టం కలిగించాడని సీఐడీ అభియోగాలు మోపింది.. అయితే, ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు చంద్రబాబు.. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 22వ తేదీకి వాయిదా వేశారు. మరోవైపు అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబుపై సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్ పిటిషన్ పై విచారణ ఈ నెల 29కి వాయిదా వేసింది విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం.. పీటీ వారెంట్ పై విచారణ ను నిలిపివేస్తూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఈ నెల 28 వరకు హైకోర్టుకు పొడించటంతో ఈ నెల 29వ తేదీ వరకు తదుపరి విచారణ వాయిదా వేసింది ఏసీబీ కోర్టు. కాగా, గత ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ సాగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. కానీ, రాజకీయ కార్యకలాపాలకు తనను దూరంగా ఉంచాలని, న్యాయవిచారణ ప్రక్రియలో మునిగిపోయేలా చేయాలని, వేధించాలన్న ఏకైక ఉద్దేశంతో ఈ కేసు నమోదు చేశారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ నెల 20వ తేదీలోగా కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఉచితంగా ఇసుకను ఇవ్వడం వల్ల రాష్ట్ర ఖజానాకు రూ. 1,300 కోట్ల మేర నష్టం వాటిల్లిందని సీఐడీ అభియోగాలు నమోదు చేసింది.. ఇసుక పాలసీపై కేబినెట్ లో చర్చించలేదని పేర్కొంది. ఈ కేసులో ఏ1గా పీతల సుజాత, ఏ2గా చంద్రబాబు, ఏ3గా చింతమనేని ప్రభాకర్, ఏ4గా దేవినేని ఉమా పేర్లను సీఐడీ చేర్చిన విషయం విదితమే.

# ముమ్మాటికి తెలంగాణ టీమ్ బీఆర్ఎస్




(మొదటి పేజీ తరువాయి) చెప్పుకొనే అమిత్ షా నోటి నుంచి వచ్చిన ఈ మాట తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా చర్చ మొదలైంది. దీనిపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా మాట్లాడుతుంటే.. ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మాత్రం బీజేపీపై విమర్శలు గుప్పిస్తున్నాయి. తాజాగా హైదరాబాద్?లో నిర్వహించిన బీసీ ఆత్మీయ సభలో మరోసారి బీసీ సీఎం నినాదాన్ని ప్రధాని మోదీ పునరుద్ఘాటించడంతో బీఆర్ఎస్ నేతలు స్పందిస్తున్నారు. 'రాష్ట్రానికి రాహుల్ ?గాంధీ వచ్చి బీఆర్ఎస్ పార్టీ.. బీజేపీకి బీ టీమ్ అంటారు.. ప్రధానమంత్రి మోదీ వచ్చి.. తాము కాంగ్రెస్?కు సీ టీమ్ అంటారు.. మేము బీజేపీకి బీ టీమ్ కాదు, కాంగ్రెస్?కు సీ టీమ్ కాదు' అంటూ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. తమది ముమ్మాటికీ టీ టీమ్.. తెలంగాణ టీమ్ అని ఎక్స్(ట్విటర్)లో వివరించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఎవరితోనైనా ఎక్కడి దాకైనా పోరాడే ఏకైక టీమ్ బీఆర్ఎస్ పార్టీదే అని తెలిపారు. నిన్నటి దాకా మత రాజకీయం చేశారని.. ఇక ఇప్పుడు కుల రాజకీయానికి తెర తీశారని ప్రధాని నరేంద్ర మోదీపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. పదేళ్ల బీజేపీ హయాంలో దేశంలోని బీసీలకు మిగిలింది వేదన మాత్రమేనని కేటీఆర్ విమర్శించారు. బీసీల జనగణన కూడా చేయని పాలన బీజేపీది అని.. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను పెట్టని ప్రభుత్వం.. బీజేపీ ప్రభుత్వం అంటూ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. అందుకే బీజేపీ ముమ్మాటికీ బీసీల వ్యతిరేక పార్టీయేనని ఆయన అన్నారు. బీసీలంటే ఆ పార్టీ దృష్టిలో బలహీనవర్గాలు.. కానీ, తమకు బీసీలంటే బలమైన వర్గాలని ప్రధానిమంత్రికి తెలియదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని బీసీలకు పదవులే కాదు.. అనేక పథకాలిచ్చిన సర్కార్ బీఆర్ఎస్?ది అని వివరించారు. టీఎస్?పీఎస్సీ పేపర్లు లీక్ చేసిందే బీజేపీ నేతలని.. నిందితులతో వేదిక పంచుకుని తమపై నిందలు వేయడం ఆశ్చర్యం కలిగిస్తుందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థల దుర్వినియోగంలో కాంగ్రెస్?నే బీజేపీ ప్రభుత్వం మించిపోయిందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఒక్కసారి కూడా రైతుల కోసం రుణమాఫీ చేయలేదని అన్నారు. రెండుసార్లు రైతులకు రుణామాఫీ చేసిన బీఆర్ఎస్ సర్కారుపై విమర్శలు చేయడం నిజంగా విడ్డూరంగా ఉందని మంత్రి కేటీఆర్ ట్వీట్?లో పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బీసీని తొలగించి.. ఓసీకి కట్టబెట్టిన మోదీ బీసీ నినాదం గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవిత అన్నారు. కేవలం ఎన్నికల కోసమే బీసీ వాదం అందుకున్న బీజేపీ.. బీసీని సీఎం చేస్తామని చెబుతోందని ఆరోపించారు. నిజామాబాద్? మాట్లాడిన ఆమె.. మోదీ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు రూ.1000 కోట్ల బడ్జెట్ ఇస్తామని ఇవ్వలేదని ప్రధాని ఆరోపిస్తున్నారని.. కానీ రూ.6200 కోట్లు రాష్ట్ర సర్కార్ ఇచ్చిందని గుర్తు చేశారు. బీజేపీ చెప్పుకునే సబ్ కా సాత్ – సబ్ కా వికాస్ నినాదంలో ఎక్కడా తెలంగాణ ప్రస్తావన లేదని.. లేదంటే రాష్ట్రానికి ఐఐఎం, ఐఐటీ, మెడికల్ కాలేజీలు వచ్చేవని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ మొదలు ప్రతి బీజేపీ నత తెలంగాణ గురించి అవహేళన చేస్తూ మాట్లాడటమే తప్ప మనస్ఫూర్తిగా సహకారం అందించిన సందర్భం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర చేస్తే అందులోనూ తెలంగాణ ప్రస్తావన లేదన్నారు. ఆ రెండు పార్టీల ఆలోచనలో కనీసం తెలంగాణ లేదని.. అటువంటి పార్టీలు మనకు అవసరమా అన్నది ప్రజలు ఆలోచించుకోవాలని కవిత సూచించారు.

# బరా బర్ ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతాం టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి



(మొదటి పేజీ తరువాయి)వారికే కాంగ్రెస్ ఇచ్చిందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రారంభించిన ప్రాణహిత ప్రాజెక్టును కేసీఆర్ దెబ్బ తీశారన్నారు. కాళేశ్వరం పేరిట లక్ష కోట్లు కేసీఆర్ దిగ మింగారని ఆరోపించారు. కేసీఆర్ ధన దాహనికి ప్రాణహిత ప్రాజెక్టు బలైందన్నారు. కాంగ్రెస్ కట్టిన కడెం, సదర్‌మాట్ ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించు కోలేదన్నారు. దళిత – గిరిజనుల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న ప్రేమ.. దేశంలో మరే పార్టీకి లేదని రేవంత్ అన్నారు. కరెంటుపై కేసీఆర్ అబద్దాలు మాట్లాడుతున్నరని విమర్శించారు. "ఏ సబ్ స్టేషన్‌లోకైనా పోదాం.. 24 గంటలు కరెంటు ఇస్తున్నట్టు నిరూపిస్తే నేను నామినేషన్ వేయను. లేకుంటే కేసీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి" అంటూ రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. అసైన్డ్ భూములు, పోడు భూములకు అన్ని రకాల హక్కులు కలిపిస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసీ – లంబాడీల మధ్య పంచాయతీని కాంగ్రెస్ తీరుస్తుందని తెలిపారు. మిమ్మల్ని కాపాడుకునే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. లంబాడీ – ఆదివాసులు తనకు రెండు కళ్ల లాంటివారని.. ఎవరికీ అన్యాయం జరగనివ్వమని హామీ ఇచ్చారు. ఇంద్రవెల్లి సాక్షిగా ప్రమాణం చేస్తున్నా... కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటామని అన్నారు. ఇంద్రవెల్లి కాల్పుల్లో చనిపోయిన కుటుంబాలను ఆదుకునే బాధ్యత కాంగ్రెస్‌ది అని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# 11 న రాష్ట్రానికి మరోసారి ప్రధాని మోడీ



(మొదటి పేజీ తరువాయి) గంటల నుండి 5.40 వరకు పరేడ్ గ్రౌండ్ బహిరంగ సభలో నరేంద్రమోడీ పాల్గొననున్నారు. అనంతరం6 గంటలకు బేగంపేట నుంచి తిరిగి వెళ్లనున్నారు. మాదిగ ఉప కులాల(మాదిగ విశ్వరూప బహిరంగ సభ) బహిరంగ సభలో%ొా% ఎస్సీ కులాల వర్గీకరణపై మోడీ ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు బీజేపీలోని పలు వర్గాలు తెలిపాయి. ప్రధాని మోడీ పర్యటన నేపథ్యంలో బీజేపీ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రధాని రాక నేపథ్యంలో పోలీసులు కూడా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ డీఎన్ఏలో బీసీ వ్యతిరేకత



(మొదటి పేజీ తరువాయి) స్థానిక కాపువాడలో పాదయాత్ర చేపట్టిన ఆయన.. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ, దళిత వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించే దమ్ముందా.. అని ప్రశ్నించారు. ర్ష్టవ్యాప్తంగా బీఆర్ఎస్?కు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని.. అలాగే కరీంనగర్?లో బీఆర్ఎస్ నేతపై ప్రజా వ్యతిరేకత పెరిగిందని అన్నారు. మంత్రి గంగుల కమలాకర్ చర్యల వల్ల ప్రజలు తీవ్రంగా విసిగిపోయారని.. గంగుల ఓడిపోతాడని వాళ్ల పార్టీ అధ్యక్షుడే ఆయన బీఫారం ఇవ్వడానికి వెనుకాడారని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నుంచి విముక్తి పొందాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ కాంగ్రెస్ అభ్యర్థులకు ఫండింగ్ చేస్తున్నారని.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే బీఆర్ఎస్?కు అమ్ముడుపోతారని బండి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవకపోయినా ఫర్వాలేదు కానీ.. బీజేపీ మాత్రం గెలవకూడదనే వ్యూహంతో సీఎం కేసీఆర్ ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్?పై నెలకొన్న ప్రజా వ్యతిరేకత ఓటును చీల్చేందుకు.. సీఎం కేసీఆర్ కాంగ్రెస్ పార్టీని పావుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల డీఎన్ఏల్లో బీసీ వ్యతిరేకత ఉంది. రాష్ట్రానికి బీసీ, దళితవర్గ అభ్యర్థిని ముఖ్యమంత్రిగా ప్రకటించే దమ్ము బీఆర్ఎస్?కు ఉందా.? బీఆర్ఎస్ ప్రభుత్వం యువతను మత్తుపదార్థాలకు బానిసలుగా మారుస్తోంది. గంగుల ఓడిపోతాడని వాళ్ళ పార్టీ అధ్యక్షుడే ఆయన బీఫా రం ఇవ్వడానికి వెనుకాడారని అన్నారు. రాష్ట్రంలో వచ్చిన ఉప ఎన్నికల్లో ఎలాగైతే బీజేపీ అభ్యర్థులను గెలిపించారో.. అదే తరహాలో ఈ శాసనసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించాలని బండి సంజయ్ కోరారు. కరీంనగర్ నగర అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చినప్పటికీ దాని ప్రస్తావన లేకుండా.. ఎంతసేపు ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో జరిగిన అభివృద్ధి గురించి మాట్లాడకుండా.. బీఆర్ఎస్ రాజకీయ లబ్ది పొందేందుకు యత్నిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల్లో కమీషన్లకు కక్కుర్తి పడటంతో నాణ్యత లోపించిందని.. కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి ప్రారంభించిన కొద్ది రోజులకే పనికి రాకుండా పోయిందని మండిపడ్డారు.

# బలి దానాలతో సాకారమైన తెలంగాణ



(మొదటి పేజీ తరువాయి) కోసం ఆత్మబలిదానాలు చేసిన 1200 మంది పైచిలుకు తెలంగాణ యువత, విద్యార్థుల గౌరవార్థం హెూంరూల్ పాటించాలన్న ఆలోచనతోనే దశాబ్దంపాటు ఇక్కడ పోటీకి దూరంగా ఉన్నట్టు తెలిపారు. ఇక, 2104 మార్చి 14న తెలంగాణలోని హైదరాబాద్ వేదికగా జనసేన పార్టీ ఆవిర్భావం జరిగింది. అంతకు ముందు 2008 నుంచి తెలంగాణ జిల్లాల్లో విరివిగా తిరిగి తెలంగాణ బాధలను, వారి ఆకాంక్షలను సమగ్రంగా అర్థం చేసుకున్నాను అని తెలిపారు పవన్ కల్యాణ్.. తెలంగాణ ప్రజల బాధలు, కష్టాలకు నేను ఎప్పుడూ అండగా ఉండేవాడిని. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తే జనసేన పార్టీని ముందుకు నడిపించేలా చేస్తోంది. తెలంగాణ ఆవిర్భవించిన దశాబ్దకాలం తర్వాత మొట్టమొదటిసారి 8 మంది అభ్యర్థులతో జనసేన ఇక్కడ ఎన్నికల బరిలో దిగుతోంది. నాలుగు కోట్ల మంది సకల జనుల సమ్మె చేస్తే సాధించుకున్న తెలంగాణ ఇది. అందుకే దశాబ్దకాలం నేను ఇక్కడ పోటీ చేయలేదన్నారు.. సంపత్ నాయక్, మిరియాల రామకృష్ణ లాంటి యువత, విద్యార్థులు రోడ్ల మీదకు వచ్చి భవిష్యత్తు నాశనం చేసుకుంటే, అలాంటి యువత బలిదానాల మీద తెలంగాణ సిద్ధించింది. వారి గౌరవార్థమే పోటీ చేయలేదు. దశాబ్దకాలం తర్వాత అన్ని జిల్లాల నుంచి పార్టీ శ్రేణుల నుంచి వచ్చి అభ్యర్థన మేరకు, వారి ఆలోచనా విధానాన్ని మన్నించి 8 మంది అభ్యర్థులతో తెలంగాణ బరిలో దిగుతున్నాం అని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇక్కడకు వలసలు వచ్చి తెలంగాణను నిర్వీర్యం చేయకూడదు.. ఆ ఉద్దేశంతోనే ఆంధ్రపై దృష్టి సారించాను అన్నారు పవన్ కల్యాణ్.. అక్కడ అభివృద్ధి ఉంటేనే ఇక్కడ వలసలు ఆగుతాయి. ఆంధ్ర నుంచి వలసలు ఆగకపోతే తెలంగాణ సాధన తాలూకా మూల కారణం నిష్ప్రయోజనం అవుతుంది. ఇప్పుడు తెలంగాణ ప్రజల కష్టనష్టాల్లో చేదోడుగా ఉండేందుకు ఇక్కడ దృష్టి సారిస్తూ పోటీ చేసే అభ్యర్థులకు నా వంతు సహాయ, సహకారాలు అందిస్తాను అన్నారు. ఇక, తెలంగాణలో పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థులు నేమూరి శంకర్ గౌడ్ (తాండూరు), ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ (కూకట్ పల్లి), మేకల సతీశ్ రెడ్డి (కోదాడ), వంగ లక్ష్మణ్ గౌడ్ (నాగర్ కర్నూలు), మిరియాల రామకృష్ణ (ఖమ్మం), డా. తేజావత్ సంపత్ నాయక్ (వైరా), లక్కినేని సురేందర్ రావు (కొత్త గూడెం), ఉమాదేవి (అశ్వారావుపేట)కు బీ ఫారమ్‌లు అందజేశారు జనసేన అధినేత పవన్ కల్యాణ్.

# టిక్కెట్లు అమ్ముకునేటోడు.. రాష్ట్రాన్ని అమ్మడా?

(మొదటి పేజీ తరువాయి) రైతుబంధు దుబారా అని మాట్లాడుతున్నరు. నిజంగానే ధరణిని బంగాళాఖాతంలో ఎయ్యాల్నా..? రైతుబంధు దుబారనేనా..? మీరు బాగా ఆలోచించాలి. ధరణిని తీసేయవద్దంటే, రైతుబంధు ఎప్పటిలాగే కొనసాగాలంటే ఇక్కడ దుర్గం చిన్నయ్యను గెలిపియ్యాలె. దుర్గం చిన్నయ్య లాంటోళ్లు గెలిస్తెనే రేపు రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తది. అప్పుడే రైతుబంధు ఎప్పటిలాగే కొనసాగుతది. మేం 24 గంటల కరెంటు ఇస్తుంటే పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మూడు గంటల కరెంటు చాలు అంటున్నడు. కేసీఆర్ వేస్టుగ ఇస్తున్నడని హేళన చేస్తున్నడు. నిజంగానే మూడు గంటల కరెంటు సరిపోతదా..? సరిపోదు గదా..? మరి 24 గంటల కరెంటు కొనసాగాలంటె ఏంజెయ్యాలె..? దుర్గం చిన్నయ్యను గెలిపించాలె. లేదంటే కరెంటు కాట గలుస్తది. రైతుబంధుకు రాంరాం. మనం గుద్దేకాడ గుద్దకపోతే ఏమైతది..? తీర్థం పోదాం తిమ్మక్క అంటే వాడు గుల్లె మనం చల్లె. అందుకే ఆలోచించి ఓటేయాలి. మోసపోతె గోసపడ్తుం' అని సీఎం కేసీఆర్ హెచ్చరించారు. 'కాంగ్రెస్ పార్టీ ఏనాడు రైతుల క్షేమం గురించి పట్టించుకోలే. కానీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చినంక రైతులకు పెట్టుబడి సాయంగా రైతుబంధు ఇస్తున్నం. రైతబీమా సదుపాయం కల్పిస్తున్నం. కొత్తకుండలో ఈదొచ్చినట్లు తెలంగాణ వచ్చినప్పుడు ఏముండె..? మంచి నీళ్లు లేవు, సాగు నీళ్లు లేవు, పేదవాళ్లు చచ్చిపోవుడు, రైతులు చచ్చిపోవుడు, చేనేత కార్మికులు చచ్చిపోవుడు. చాలా దౌర్భాగ్యమైన పరిస్థితులు ఉండె. ఒక్కొక్కటి సగబెట్టుకుంటూ అవినీతి రహిత పాలన చేస్తుంటే ఇప్పుడు తెలంగాణను ఇంత దూరం తీసుకొచ్చినం. ఇదే అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపియ్యాలె. దయచేసి మీరు ఆలోచన చేయాలని నేను కోరుతున్నా' అన్నారు. 'ఇప్పుడే చిన్నయ్య చెప్పిండు. బెల్లంపల్లిలో ప్రభుత్వ, సింగరేణిలో జాగాలు కలిపి దాదాపు 10 వేల మందికి ఇళ్ల పట్టాలు వచ్చినయన్నడు. ఇంకా కొంత మంది ఉన్నరు సార్ అని చెప్పిండు. వాళ్లందరికి గూడా పట్టాలు ఇప్పిచ్చే బాధ్యత నాది అని నేను హామీ ఇస్తున్నా. ఎవరున్నా మీ ఎమ్మెల్యేగారికి దరఖాస్తు పెట్టుండ్రి. తప్పకుండా వాళ్లందరికీ ఇస్తం అన్నారు. ఇవాళ డబ్బు కట్టలు పట్టుకొని దిగుతున్నరు. ఎన్నికలు అయిపోతే మళ్లీ కనడబరు.. చెన్నూరు ప్రజలు ఈ మనిషిని నాలుగుసార్లు ఓడగొట్టారు. ఇక్కడికి వచ్చిన కాంగ్రెస్ మనిషిని. మరి చెన్నూరులో చెల్లని రూపాయి.. బెల్లంపల్లిలో చెల్లుతుదా..? చెన్నూరులోనే చెల్లకపాయే వాళ్లే తీసికొట్టిరి. మరి బెల్లంపల్లిలో ఉన్న మనం తెలివి తక్కువ వాళ్లమా..? చెన్నూరు కంటే మనం తెలివి గల వాళ్లమే కదా..? మరి రుజువు చేయాలి. అక్కడ చెల్లని రూపాయి ఇక్కడ ఎట్ల చెల్లుతది. వాళ్లు తిరస్కరించిన తర్వాత మనం ఎట్ల గెలిపిస్తాం. ఎలక్షన్ల తర్వాత ఉంటారా..? కడుపునొచ్చినా.. కాళ్లు నొచ్చినా కనబడుతారా..? ఎన్నికలు రాగానే సూట్‌కేసులు పట్టుకోవాలా..? డబ్బు సంచులు పట్టుకోవాలా..? దిగాలా.? వాన్ని వీన్ని కొని గోల్ మాల్ చేయాలా.. ఇదే వారి పని. మంచిగున్న ప్రజా ప్రతినిధులను కొందరిని కొంటున్నారు అని కేసీఆర్ మండిపడ్డారు. చిన్నయ్య నువ్వేం ఫికర్ చేయకు. అమ్ముడుపోతే వాడొక్కడే గడ్డపారలాగా అమ్ముడుపోతడు. ఇవాళ ప్రజల్లో చైతన్యం ఉంది. ప్రజలు నీ పక్షాన ఉంటారు. ప్రజలు న్యాయం చెప్తారు. ఎవడో నలుగురు అమ్ముడుపోయినంత మాత్రాన వాడు తలమాసినోడు అయితడు గానీ మనం కాము. ఈ ప్రజలే మనల్ని కాపాడుతారు. ప్రజల ఆశీర్వాదమే మనకు శ్రీరామరక్ష. కాంగ్రెస్, బీజేపోళ్లకు సెల్ఫ్ ఉండదు. ఢిల్లీలో కట్క వేస్తేనే ఇక్కడ లైట్ వెలుగుతది. మాకు ఎవ్వరూ బాసులు లేరు.. తెలంగాణ ప్రజలే మా బాసులు. మీ అవసరాలు, మంచి చెడు గురించి, మీ ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా మేం పని చేస్తున్నామని కేసీఆర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. నాటి కాంగ్రెస్ నేతల చేతగాని తనంవల్లే సింగరేణిలో కేంద్రానికి 49 శాతం వాటా కోల్పోవాల్సి వచ్చిందన్నారు. చేతగాని కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అమ్మకుంటదని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు అమ్మ.. బొమ్మ పేరు చెప్పి దళితులను ఓటు బ్యాంకుగా వాడుకున్నారని ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. బెల్లంపల్లి చైతన్యం ఉండే ప్రాంతం. ఇక్కడ ఉద్యమాలు జరిగన ప్రాంతం. 75 ఏండ్ల స్వతంత్ర భారతదేశం లో దళితుల బతుకులు బాగు పడలేదు. తరతరాలుగా, యుగయుగాలుగా అణిచివేతకు గురయ్యారు. తీవ్రమైన వివక్ష ఎదుర్కొన్నారు. ఆనాడే నెహ్రూ దళితుల గురించి అభ్యుదయమైన కార్యక్రమం చేసి ఉంటే ఇవాల్టికి దళితుల బతుకులు ఇలా ఎందుకు ఉండేవి..? దయచేసి ఈ విషయాలు ఆలోచించాలి. ఇది నిజమా..? కాదా..? అమ్మ.. బొమ్మ పేరు చెప్పి దళితులను ఓటు బ్యాంకుగా వాడుకున్నారు. దళితుల గురించి ఒక స్పెషల్ గ్రోత్ ఇంజిన్ పెట్టలేదు. అది చేసి ఉంటే దళితుల దుస్థితి ఈ

# మార్ఫింగ్ చేస్తే మూడేళ్లు జైలు



(మొదటి పేజీ తరువాయి) అడ్డుకోవటంపై కేంద్ర ఐటీ శాఖ స్పందించింది. ఇలాంటి వీడియోలను అడ్డుకోవాల్సిన బాధ్యత సోషల్ మీడియా సంస్థలదేనని స్పష్టం చేసింది. ఇందుకు సం బంధించి సోషల్ మీడియా కంపెనీలకు ఒక అడ్వయిజరీని జారీ చేసింది. కృత్రిమ మేధ (ఏఐ)తో కంటెంట్‌ను తయారుచేస్తూ తప్పుదోవ పట్టిస్తున్న వాటిపై 24 గంటల్లోగా చర్యలు చేపట్టాలని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్..తదితర సోషల్ మీడియా సంస్థలకు సూచించింది. ఐటీ చట్టం–2000 సెక్షన్ 66–డీ కింద చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు అవకాశముందని తెలిపింది. కంప్యూటర్ సాంకేతి కతను ఉపయోగించి వ్యక్తుల్ని మోసగిస్తే ఈ సెక్షన్ కింద రూ.లక్ష వరకు జరిమానా, మూడేండ్ల జైలు శిక్ష విధించే అవకాశముందని అడ్వైయిజరీలో కేంద్రం గుర్తు చేసింది. ఐటీ నిబంధనావళిలో రూల్ 3(2) (బీ)ను ఉపయోగించి తప్పుడు వీడియోలను, కంటెంట్‌ను తొలగించవచ్చునని తెలిపిం ది. ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా మార్ఫింగ్ వీడియోలు, ఫొటోలపై చర్యలు చేపట్టాలని పేర్కొన్నది. డీప్‌ఫేక్ వీడియోపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ డిమాండ్ చేశారు. మార్ఫింగ్ వీడియో తననెంతో భయానికి గురిచేసిందని నటి రష్మిక మందన్నా ఆందోళన వ్యక్తం చేశారు.

# సహాయకుడిగా వచ్చే వారికీ ఇంక్ తప్పనిసరి..!



(మొదటి పేజీ తరువాయి) శాసనసభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. అందరూ ఎన్నికల కోడ్ పాటించాలని సూచించింది ఎన్నికల కమిషన్. నిబంధనలు పాటించకపోతే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ప్రచారంలో భాగంగా అన్ని రాజకీయ పార్టీలు సువిధ యాప్ ద్వారా ముందస్తు పర్మిషన్ తీసుకోవాలన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించే స్థలం, సమయం తదితర వివరాలను స్థానిక పోలీస్ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. కుల, మత, భాషలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేయకూడదని ఈసీ స్పష్టం చేసింది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లను వినియోగించకూడదన్నారు. నవంబర్ 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. అఫిడవిట్ లోని అన్ని కాలమ్స్‌ను తప్పనిసరిగా అభ్యర్థులకు సూచించారు. నామినేషన్ పత్రాలను ఆన్ లైన్ ద్వారా కూడా స్వీకరించడం జరుగుతుందని ఈసీ స్పష్టం చేసింది. పోటీలో ఉండే అభ్యర్థులు తమ క్రిమినల్ రికార్డులను లీడింగ్ న్యూస్ పేపర్స్, టీ.వీ ఛానళ్లలో పబ్లిష్ చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రచారానికి అయ్యే ఖర్చును అధ్యయనం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధుల బృందం రాష్ట్రంలో ఇప్పటికే పర్యటిస్తోంది. అటు ఈసారి ఉదయం 5.30 గంటల నుంచే మాక్ పోలింగ్ ప్రారంభిస్తారు. పోలింగ్ ఏజెంట్లుగా సర్పంచ్, వార్డు సభ్యులు కూడా కూర్చునేందుకు అవకాశం కల్పించింది ఎన్నికల కమిషన్. మరోవైపు పోలింగ్ శాతం పెంచే అంశంపైనా ఈసీ కసరత్తు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు సదస్సులు నిర్వహించే ఏర్పాట్లు చేస్తోంది.

# చికిత్స పొందుతూ వరుణ్ రాజ్ మృతి



**హైదరాబాద్, నవంబర్ 8 (సమ సమాజం):** అమెరికాలో కత్తిపోట్లకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థి వరుణ్ రాజ్ (29) మృతి చెందాడు. పది రోజులుగా తీవ్ర గాయాలతో లూథరన్ దవాఖానలో చికిత్స పొందుతున్న వరుణ్.. పరిస్థితి విషమించడంతో తాజాగా ప్రాణాలు కోల్పోయాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఖమ్మం జిల్లా మామిళ్లగూడెంకు చెందిన పుచ్చా వరుణ్ రాజ్ అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలో ఎంఎస్ చదువుతున్నాడు. రోజూలాగే అక్టోబర్ 31న జిమ్‌కు వెళ్లిన వరుణ్.. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఓ దుండగుడు కత్తితో పొడిచాడు.

**Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*,** Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
**Printed at *Panidhar PUBLICATIONS.*** Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU,***
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in